క్లుప్తంగా

నేడు న్యాయ విజ్ఞాన సదస్సు

టెక్కలి: మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే దుష్ప్రయోజనాలు, అక్రమ రవాణా అనే అంశంపై బుధవారం టెక్కలిలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహిస్తున్నట్లు స్థానిక కోర్టు సిబ్బంది తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. జూనియర్ సివిల్ జడ్జి ఎస్‌హెచ్‌ఆర్ తేజ చక్రవర్తి మల్ల ఆధ్వర్యంలో స్థానిక డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం ఆవరణలో ఉదయం తొమ్మిది గంటలకు సదస్సు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

కంప్యూటర్, ప్రింటర్ వితరణ


కంప్యూటర్ సామగ్రిని అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

సంతబొమ్మాళి: మండలంలోని మరువాడ ఎంపీయూపీ స్కూల్‌కి అదే గ్రామానికి చెందిన యువసేన యూత్ అసోసియేషన్ సభ్యులు రూ.45 వేలు విలువచేసే కంప్యూటర్ పరికరాలు వితరణగా సమకూర్చారు. వీటిని విద్యా కమిటీ చైర్మన్ సూరాడ దాసురాజు చేతులు మీదుగా హెచ్‌ఎం రాజీవ్‌కు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా దాసురాజు మాట్లాడుతూ.. పాఠశాల అభివృద్ధికి యువకులు ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

చల్లబడిన పలాస


కాశీబుగ్గ కేటీరోడ్డులో కురుస్తున్న వర్షం

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ జంట పట్టణాలతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం భారీ వర్షం కురిసింది. మండుటెండ, ఉక్కపోతతో ఉదయమంతా ఇబ్బంది పడ్డ జనాలకు మధ్యాహ్నం కురిసిన వర్షం ఉపశమనాన్నిచ్చింది. ఈ వర్షంతో ఉద్దాన ప్రాంతంతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన వారంతా సంతోషం వ్యక్తం చేశారు. వ్యవసాయ పనులకు ఈ వర్షం ఉపకరిస్తుందని రైతులు చెబుతున్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం


మృతుని భార్యకు సాయాన్ని అందజేస్తున్న సేవా సంస్థ సభ్యులు

కంచిలి: మండలంలోని అంపురం గ్రామానికి చెందిన ఏదూరు నారాయణ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. పేదవర్గానికి చెందిన మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు, కాలు సెప్టిక్ అయి బాధపడుతున్న తండ్రి ఉన్నారు. ఆ కుటుంబం ఒకవైపు దుఃఖం, మరోవైపు ఆర్థిక సమస్యలతో సతమతమవుతోంది. ఈ విషయం తెలుసుకున్న మఠం సరియాపల్లి గ్రామానికి చెందిన ఎస్.ఎం.ఎస్.సేవా సంస్థ బృందం రూ. 11 వేలు సేకరించింది. ఈ మొత్తాన్ని బాధిత కుటుంబానికి మంగళవారం అందజేసి అండగా నిలిచారు.సేవా సంస్థ సభ్యులంతా పాల్గొన్నారు.

పశువ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


మకరాంపురంలో పశువుకు టీకా వేస్తున్న సిబ్బంది

కంచిలి: పశువ్యాధులపై అప్రమత్తంగా యజమానులు వ్యవహరించాలని మఖరాంపురం పశువైద్యాధికారి డాక్టర్ జి.కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని మకరాంపురం పంచాయతీ పరిధి మకరాంపురం, సాలినపుట్టుగ, కొరికానపుట్టుగ గ్రామాల్లో పశువులకు జబ్బవాపు, గొంతువాపు వ్యాధులు రాకుండా టీకాలు వేసే కార్యక్రమాన్ని మంగళవారం చేపట్టారు. ఇందులో భాగంగా 416 పశువులకు టీకాలు వేసినట్లు తెలిపారు. తొలకరిలో పశువులు వ్యాధులు బారిన పడకుండా రైతులు తీసుకోవలసిన జాగ్రత్తలను పశువైద్యాధికారి కిరణ్‌కుమార్ వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది రాజేష్, అశోక్, ఆరుగురు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బెల్లుపడలో 'నేను బడికి పోతా' ర్యాలీ


ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం: బెల్లుపడ కాలనీ మున్సిపల్ ప్రాథమిక పాఠశాల సిబ్బంది, విద్యార్థులు 'నేను బడికిపోతా' కార్యక్రమంలో భాగంగా మంగళవారం ర్యాలీ నిర్వహించారు. చదువు ప్రాధాన్యతను వివరిస్తూ నినాదాలు చేశారు. మండల విద్యాశాఖాధికా కె.అప్పారావు, మండల విద్యావనరుల కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

శిథిల భవనం..

విధులు భయం భయం!

- వజ్రపుకొత్తూరు మండల పరిషత్ భవనం దుస్థితి
- ముళ్ల పొదల మధ్య అసంపూర్తిగా నూతన భవనం
- కొద్దిపాటి నిధుల విదిల్చితే వినియోగంలోకి..


శిథిలావస్థలో ఉన్న ప్రస్తుత ఎంపీడీవో కార్యాలయం


శిథిలమైన భవనం పిల్లర్లు

వజ్రపుకొత్తూరు: ప్రజలకు ఉపయోగంగా ఉండాల్సిన మండలాభివృద్ధి కార్యాలయ భవనాలు శిథిలమైయ్యాయి. దీంతో ఎంపీడీవో నుంచి అటెండర్ వరకు భయంతోనే శిథిలైమన గదుల్లోనే విధులు నిర్వహించాల్సిన పరిస్థితి. ప్రధాన పిల్లర్లు సైతం పెచ్చులూడిపోగా కింద పడుతున్న శ్లాబ్ శిథిలాలు భయం గొలుపుతున్నాయి. 1997లో దివంగత మాజీ ఎంపీ హనుమంతు అప్పయ్య దొర ప్రారంభించిన ఈ భవనాలకు కాలం చెల్లింది. తీర ప్రాంతం కావడంతో గాలిలో ఉప్పుతో కూడిన తేమ అధికంగా ఉండడం వల్ల భవనాలు 27 ఏళ్లకే శిథిలమైయ్యాయి. భవనాలకు వాడిన ఇనుము తుప్పు పట్టిపోగా గదుల్లో పాముల పుట్టలు దర్శనమిస్తున్నాయి. గతి లేక అధికారులు విధులు నిర్వహిస్తున్నారు. సర్వ సభ్య సమావేశం నిర్వహించే గది కూడా శిథిలావస్థకు చేరింది. మొత్తం భవనమే పనికిరాకుండా పోయింది. మండల పరిషత్‌కు నిధులున్నా కనీసం రంగులు వేయని దుస్థితి ఉంది.

ఏడేళ్లుగా నిర్మాణంలో..

కాగా శిథిలమైన ఎంపీడీవో భవనానికి పక్కనే ఏడేళ్ల కిందట కొత్త భవనం నిర్మించాలని అధికారులు భావించారు. నిధుల కొరత, ఇసుక, ఇనుము, సిమెంట్ ఇతర ముడి సరుకుల ధరలు పెరగడం, అంచనా వ్యయం మారకపోవడంతో భవనం పనులు బాలారిష్టాలు దాటలేదు. 2017లో రూ.1.20 కోట్లుతో పనులు ప్రాంభించగా టెండర్ ప్రక్రియ ఆలస్యం కావడంతో అప్పటి టీడీపీ ప్రభుత్వంలో బిల్లులు మంజూరు కాలేదు. అనంతరం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పెండింగ్‌లో ఉన్న రూ.43 లక్షల వరకు బిల్లు చెల్లించినప్పటికీ కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కారణంగా పనులు ముందుకు సాగలేదు. దీంతో పాటు మంజూరు చేసిన పలాస, టెక్కలి, మందస, కోటబొమ్మాళి, సంతబొమ్మాళి తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలు సర్వాంగ సుందరంగా పూర్తయి వినియోగంలో ఉన్నాయి ప్రస్తుతం అర్ధంతరంగా అగిపోయిన నూతన భవనం ముళ్ల పొదల మధ్య పాడుబడిన భవనంలా దర్శనమిస్తోంది. కొద్దిపాటి నిధులు విదిల్చితే భవనం పూర్తి అయ్యేందుకు అవకాశం ఉంటుంది. అధికారులు దృష్టి సారించి, నేతలు స్పందించి వజ్రపుకొత్తూరు మండల పరిషత్‌కు పూర్వ వైభవం తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.


ముళ్లపొదల మధ్య అర్ధాంతరంగా నిలిచిపోయిన నూతన భవన నిర్మాణం

విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందజేత


విద్యార్థినికి జ్ఞాపిక అందజేస్తున్న దాతలు బాబూరావు, రామలింగం

వజ్రపుకొత్తూరు రూరల్: మండలంలోని అక్కుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించారు. దీంతో వారిని శ్రీకాకుళం ఆర్ట్స్ కాలేజ్ విశ్రాంతి ప్రిన్సిపాల్ మురపల్లి బాబూరావు, మాజీ సర్పంచ్, లండ రామలింగం చేతుల మీదగా సోమవారం సత్కరించి అభినందించారు. అత్యధిక మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచిన గనగళ్ల చేతనకు పది వేల రూపాయల నగదుతో పాటు జ్ఞాపికను అందించారు. అలాగే ద్వితీయ, తృతీయ స్థానంలో మార్కులు సాధించిన కాస హాసినికి రూ. అరు వేలు, జె.సీమోనాకు రూ నాలుగు వేల నగదుతో పాటు జ్ఞాపికలను అందించారు. 500 మార్కులు దాటిన మరో ఐదుగురు విద్యార్థులకు ఒకొక్కరికీ వెయ్యి రూపాయల చొప్పున అందించి అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం జగన్నాథం, పాఠశాల విద్యాకమిటీ చెర్మన్ కామేష్, విద్యా కమిటీ చైర్మన్ మోహన్‌రావు, శ్రీరామ సంఘ అధ్యక్షుడు మద్దు కామేశ్వరరావు, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఉపాధి పనులు ప్రారంభం


కొత్త చెరువులో పనులు ప్రారంభిస్తున్న నాయకులు

వజ్రపుకొత్తూరు: ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న పనులను వేతనదారులు సద్వినియోగం చేసుకోవాలని గోవిందపురం పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ పుచ్చ ఈశ్వరరావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కర్ని రమణ అన్నారు. గోవిందపురం, సీతంపేట గ్రామాల్లోని కొత్త చెరువు, కొత్త ట్యాంకుల్లో ఉపాధి పనులను మంగళవారం ప్రారంభించారు. రైతులకు ఉపయోగపడేలా చెరువులకు మరమ్మతులు చేపట్టాలని సూచించారు. ఉప సర్పంచ్ గుంట సత్యం, కోఆప్షన్ మాజీ సభ్యులు పి.వేణుగోపాల్‌రావు, ఎం.నారాయణ, జి.గణేష్, పి.మోహనరావు, ఫీల్డు అసిస్టెంట్ ఎం.లక్ష్మి పాల్గొన్నారు.

పాఠశాల విద్యను బలోపేతం చేయాలి


డిమాండ్లు పరిష్కరించాలని నినాదాలు చేస్తున్న ఏపీటీఎఫ్ ప్రతినిధులు

కవిటి: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి కొత్త ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు మొర్రి గోపి అన్నారు. 117 జీవోను రద్దుచేసి ప్రాథమిక విద్యకు ప్రతి గ్రామంలో ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. కవిటి ప్రాథమిక పాఠశాలలో మండల స్థాయిలో మంగళవారం సంఘ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వానికి అభినందనలు తెలుపుతూ తీర్మానం చేశారు. కొత్త పీఆర్సీపై రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగు, ఇంగ్లిష్ మాధ్యమాలను కొనసాగించాలన్నారు. సమావేశంలో మండల గౌరవ అధ్యక్షులు కొత్తపల్లి రంగారావు, మండల ప్రధాన కార్యదర్శి గుడియా వంశీ, జిల్లా కార్యదర్శి శమల్ల రాజబాబు, కార్యవర్గ సభ్యులు శ్రీధర్ సమంతో, భార్గవ్, శరత్, ప్రకాష్, భగవాన్, శ్రీకాంత్, వెంకట్రావు ఉన్నారు.

శ్రీనివాస్ సేవలు అభినందనీయం


శ్రీనివాసరావు దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

సోంపేట: సోంపేట రోటరీ క్లబ్ అధ్యక్షుడిగా దుద్ది శ్రీనివాసరావు ఏడాది పాటు అందించిన సేవలు అభినందనీయమని రోటరీ పీజీడీ జి.విశ్వనాథం, శ్రీశయన చైతన్య వేదిక ప్రతినిధులు అన్నారు. శ్రీశయన చైతన్యదీపిక సంఘం ఆధ్వర్యంలో శ్రీనివాసరావు దంపతులకు మంగళవారం సత్కరించి అభినందించారు. వక్తలు మాట్లాడుతూ.. ఏడాదిగా సోంపేట, కంచిలి మండలాల్లో రోటరీ క్లబ్ అధ్యక్షుడిగా శ్రీనివాసరావు చేసిన సేవలను గుర్తు చేశారు. చైతన్యదీపిక సంస్థ భవన నిర్మాణానికి రూ. 18 లక్షల విలువైన స్థలాన్ని అందించారని చెప్పారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన


పారిశుద్ధ్య పనులు పరిశీలిస్తున్న డీఎల్‌పీవో వెంకటరమణ

కవిటి:

కవిటి మేజర్ పంచాయతీ కె.కొత్తూరులో జరుగుతున్న ప్రత్యేక పారిశుద్ధ్య పనులను టెక్కలి డివిజనల్ పంచాయతీ అధికారి ఇప్పిలి వెంకటరమణ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. వర్షాకాలంలో దోమలవ్యాప్తికి అధికంగా అవకాశాలు ఉన్న నేపథ్యంలో పారిశుద్ధ్య కార్యక్రమాల పటిష్టంగా చేయాలన్నారు. వాటర్‌ట్యాంకుల క్లోరినేషన్, నీటి నాణ్యత పరీక్షలు చేపట్టాలన్నారు. రికార్డుల నిర్వహణపై ప్రత్యేకశ్రద్ధ కనబర్చాలని కవిటి పంచాయతీ ఈవో జి.వీరభద్రస్వామికి సూచించారు.

ప్రోటోకాల్ ఉల్లంఘించి విత్తనాలు పంపిణీ

కంచిలి: మండలంలో కేసరపడ గ్రామంతో పాటు పలు చోట్ల ప్రజల ద్వారా ఎన్నికైన ప్రజాప్రతినిధులను ఆహ్వానించకుండా ప్రోటోకాల్ ఉల్లంఘించి విత్తనాలు పంపిణీ అధికార పార్టీ నేతలతో చేపట్టారని స్థానిక సర్పంచ్ కప్పల చంద్రమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు మెండ హేమావతిలు ఆరోపించారు. ఈ మేరకు వారు మంగళవారం సాక్షితో మాట్లాడారు. వ్యవసాయశాఖ యంత్రాంగం కూడా కనీసం స్థానిక ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వకపోవడంపై తప్పుపట్టారు. దీన్ని తాము ఖండిస్తున్నామన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన వ్యవసాయ అధికారులు


ఎమ్మెల్యే శిరీషతో మాట్లాడుతున్న అధికారులు

కాశీబుగ్గ: పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషను నియోజకవర్గం పరిధిలోని వ్యవసాయ శాఖ అధికారులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. దుశ్శాలువతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో పలాస వ్యవసాయ కార్యాలయం ఏడీ మధు, అధికారులు నాగరాజు, కిరణ్‌వాణి, పాపారావు, సిబ్బంది ఉన్నారు.

కాళమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే


అమ్మవారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే శిరీష తదితరులు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ 24వవార్డు పరిధి పురుషోత్తపురం గ్రామదేవత కాళమ్మతల్లి సంబరాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష దర్శించుకొని పూజలు చేశారు. నాయకులు యార్లగడ్డ వెంకన్నచౌదరి, గాలి కృష్ణారావు, పీరుకట్ల విఠల్‌రావు, వార్డు పెద్దలు సప్ప నవీన్‌యాద్, దడేల నరసింహులు, డొక్కరి శంకరరావు, చిన్ని, ప్రవీణ్ ఉన్నారు.

నేడు కంచిలి మండల సమావేశం

కంచిలి: కంచిలి మండల సర్వసభ్య సమావేశాన్ని బుధవారం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో వి.నీరజ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి అధ్యక్షతన మండల పరిషత్ సమావేశ మందిరంలో ఉదయం 10.30 గంటలకు నిర్వహించబోయే సమావేశానికి సభ్యులు, అన్ని శాఖల అధికారులు విధిగా హాజరు కావాలన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి


ఇచ్ఛాపురం: అవగాహన కల్పిస్తున్న సీఐ ఇమ్మాన్యూయేల్ రాజు తదితరులు


సోంపేట: అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ చంద్రమోహన్

ఇచ్ఛాపురం: మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని సీఐ టి.ఇమ్మాన్యూయేల్ రాజు అన్నారు. పట్టణంలోని జ్ఞానభారతి విద్యాసంస్థల ఆవరణలో మంగళవారం మాదకద్రవ్యాల వ్యతిరేఖ వారోత్సవాల్లో భాగంగా అవగాహన కార్యక్రమాన్ని పాఠశాల సీఈఓ జోహార్‌ఖాన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు అలవాటుపడి జీవితాలను నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. ఉజ్వల భవిష్యత్‌పై విద్యార్థులు దృష్టిసారించాలని సూచించారు. పట్టణ ఎస్సై వి.సత్యన్నారాయణ, పాఠశాల ట్రస్టీ రవణమూర్తి, హెచ్‌ఎం రషీదాసుల్తానా, ప్రిన్సిపాల్ ఐబీ పండా, మేనేజర్ ప్రమోద్‌కుమార్, ఆలీమ్‌ఖాన్ పాల్గొన్నారు.

టెక్కలి: మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని స్థానిక సెబ్ ఇన్‌స్పెక్టర్ జి.ఎస్.రాజశేఖర్ సూచించారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేఖ దినోత్సవాల్లో భాగంగా స్థానిక విశ్వజ్యోతి జూనియర్ కళాశాలలో మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...మత్తు పదార్థాల వినియోగం వలన భవిష్యత్ సర్వ నాశనమవుతోందన్నారు. విద్యార్థులంతా మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పలికారు. పలాస డీటీఎఫ్‌సీ ఐ.రామచంద్రకుమార్ పాల్గొన్నారు.

సోంపేట: స్థానిక కుమార్ జూనియర్ కళాశాలలో మాదక ద్రవ్యాల వినియోగంతో కలుగు నష్టాలు గురించి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో పాల్గొన్న సోంపేట ఎస్ఈబీ ఎస్సై చంద్రమోహన్ మాట్లాడుతూ.. విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని కోరారు. డ్రగ్స్ వాడినా, రవాణా చేస్తూ పట్టుబడినా నార్కోటిక్ చట్టం ప్రకారం కఠిన చర్యలు ఉంటాయని వివరించారు. కళాశాల కరస్పాండెంట్ రవికుమార్ పాల్గొన్నారు.

ఘనంగా గ్రామదేవత చల్లదన ఉత్సవాలు


సోంపేట: పలాసపురంలో గ్రామ దేవతను ఊరేగిస్తున్న దృశ్యం

సోంపేట: మండలంలోని పలాసపురం, బెంకిలి గ్రామపంచాయతీల్లో ఆయాగ్రామ దేవతల చల్లదన ఉత్సవాలు మంగళవారం ఘనంగా జరిగాయి. పలాసపురంలో గ్రామస్తులు, ఉపాధి వేతనదారులు, రైతుల ఆధ్వర్యంలో సింధుపట్టపురాణి చల్లధన మహోత్సవం జరగ్గా.. కోలాటం, కాళీకా వేషాధారణలతో తిరువీధులు నిర్వహించారు. సర్పంచ్ తడక జోగారావు, జెడ్పీటీసీ సభ్యురాలు తడక యశోద పాల్గొన్నారు. అలాగే బెంకిలిలో కూడా గ్రామదేవత బైరోడమ్మ చల్లదన ఉత్సవం నిర్వహించి అమ్మవారి విగ్రహాన్ని ఊరేగించారు.

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని బూర్జపాడు, వేదపురం, కొఠారి, మండపల్లి తదితర గ్రామాల్లో గ్రామదేవతలకు చల్లదనం ఉత్సవాలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మేళతాళాలు, మంగళవాయిద్యాలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాల నడుమ గ్రామదేవతను ఊరేగించారు.

పశువులకు గొంతువాపు నివారణ టీకాలు


ఎట్టుపురంలో పశువుకు టీకా వేస్తున్న దృశ్యం

కోటబొమ్మాళి: పట్టుపురం, పాకివలస, మెండపేట గ్రామాల్లో పశువులకు గొంతువాపు నివారణ టీకాలను పశువైద్య సిబ్బంది మంగళవారం వేశారు. 248 పశువులకు టీకాలను తమ సిబ్బంది వేశారని కోటబొమ్మాళి వెటర్నరీ ఏడీ మంద లోకనాథం చెప్పారు. పశువులకు అధికజ్వరం, ఆహారం తినకపోవడం వంటి లక్షణాలుంటే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పశువైద్య సిబ్బందికి సమాచారమివ్వాలని కోరారు. కార్యక్రమంలో కురుడు, తిలారు పశువైద్యులు ఎల్.కిరణ్‌కుమార్, మెండ పగ్నచైతన్య, వెటర్నరీ సహాయకులు కె.ముఖుందరావు, కోట ధర్మారావు ఉన్నారు.

ఎక్కువ కేసులను రాజీ చేయాలి


మాట్లాడుతున్న సివిల్‌జడ్జి ప్రసన్నలత

కోటబొమ్మాళి: ఈ నెల 29న జరగనున్న జాతీయ లోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా చూడాలని కోటబొమ్మాళి కోర్టు జూనియర్ సివిల్‌జడ్జి బి.ఎం.ఆర్. ప్రసన్నలత కోరారు. కోటబొమ్మాళి, సంతబొమ్మాళి, జలుమూరు సివిల్, ఎస్ఈబీ పోలీసులు, న్యాయవాదులతో లోక్‌అదాలత్ నిర్వహణపై మంగళవారం సమీక్ష నిర్వహించి మాట్లాడారు. ఏజీపీ ఎస్.తిరుపతి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎల్.శ్రీనివాసులు, న్యాయవాదులు ఎస్.శ్రీధర్‌రాజు, వాన నేతాజీ రావు పాల్గొన్నారు.

విద్యకు ప్రాధాన్యం


విద్యార్థులకు స్టూడెంట్‌కిట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే అశోక్

ఇచ్ఛాపురం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తుందని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. ధర్మపురం ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్టూడెంట్‌కిట్లను మంగళవారం అందజేశారు. ఎంఈవో కె.అప్పారావు, జనసేన పార్టీ నాయకుడు దాసరి రాజు, మాజీ ఎంపీపీ దక్కత డిల్లీరావు, మేరుగు సూర్యనారాయణ, హెచ్‌ఎం ఎస్.విశ్వనాథం పాల్గొన్నారు.

ఘనంగా వినాయక ఆలయ వార్షికోత్సవం


పూజలు చేస్తున్న భక్తులు

నందిగాం: మండల కేంద్రమైన నందిగాం గణేష్ కాలనీలో కొలువై ఉన్న వరసిద్ధి వినాయక ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ నిర్మాణకర్త, నందిగాం ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి దంపతులు, గణేష్ కాలనీ వాసులు ఆధ్వర్యంలో గ్రామపురోహితులు రేజేటి బోసుబాబు, మేడేపల్లి రమేష్‌బాబులు కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. దీనిలో భాగంగా సుప్రభాతసేవ, విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచనం, మండపారాధన, విశేష అభిషేకాలు, గణపతి మూలమంత్ర హవనం, పూర్ణాహుతి తదితర కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం భక్తులకు మహాఅన్నప్రసాద వితరణ గావించారు. సాయంత్రం గణేష్‌కాలనీ చిన్నారులచే కోలాటంతో గ్రామమంతా స్వామి వారి ఊరేగింపు నిర్వహించారు.

రోడ్డుపైకి మురుగునీరు!


రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ 17వవార్డు తిలక్‌నగర్‌లో ఎస్‌ఎండీ పార్లర్ వెనుకవీధిలో రోడ్డుపైకి మురుగునీరు వచ్చి చేరింది. కాలువలలో ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలువలో ఉన్నటువంటి మురుగునీరు రోడ్డుపైకి ప్రవాహించడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. మున్సిపల్ శానిటేషన్ అధికారులు తక్షణమే వీధిలో పర్యటించి కాలువలు శుభ్రం చేసి దుర్గంధం నుంచి కాపాడాలని కోరుతున్నారు. పలు విద్యా సంస్థలతో పాటు, మంకినమ్మ ఆలయానికి ప్రధాన రహదారి కావడంతో ఇబ్బందిగా ఉందని సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రైవేట్ కళాశాలలకు దీటుగా..


కళాశాలలో కోర్సుల వివరాలు, సదుపాయాలను తెలియజేస్తూ ఏర్పాటు చేసిన బోర్డు

టెక్కలి: ప్రైవేట్ కళాశాలలకు దీటుగా టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యా వసతులపై సిబ్బంది ప్రచారం చేస్తున్నారు. సాధారణంగా ప్రైవేట్ కళాశాలలకు చెందిన యాజమాన్యం ప్రతీ ఏటా వారి కళాశాలలో అందజేస్తున్న కోర్సుల వివరాలు, అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు ఫొటోలు, మౌలిక సదుపాయాలపై హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తుంటారు. అయితే టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ వినూత్నంగా ఆలోచన చేశారు. కళాశాలలో అందజేస్తున్న వివిధ రకాల కోర్సులు, అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థుల ఫొటోలతో పాటు మౌలిక సదుపాయాలపై కళాశాలకు ఎదురుగా బోర్డులను ఏర్పాటు చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కళాశాలపై ప్రచారాలు చేయడం స్థానికంగా ఆకట్టుకుంటోంది.